# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ఈ రోజు ప్రమాణం చేశారు.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాల పునర్విభజన సహా పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**

3. **ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఏలూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.**

4. **ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యతనివ్వాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

5. **రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.**

==========================

సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తి-సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ఈరోజు ప్రమాణం చేశారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం నిన్నటితో ముగిసిన నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిస్సార్ జిల్లాలో జన్మించారు. పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన ఆయన, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. సీజేఐగా ప్రమాణం చేసిన జస్టిస్ సూర్యకాంత్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో ఆర్థిక, వ్యాపార నిర్వహణ వ్యవస్థపై సంబంధిత శాఖల అధికారులతో ఆర్థిక వనరుల నిర్వహణ, మార్కెటింగ్ కార్యకలాపాలు, మానవ వనరుల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లాల పునర్విభజనపై అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం కాలుష్య

నియంత్రణ మండలి, సాయంత్రం రియల్ టైం గవర్నెన్స్ ఆర్టీజీఎస్‌పై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

------------------------------

ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఈ రోజు ఏలూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ద్వారకాతిరుమల మండలం ఐ యస్ జగన్నాథపురంలోని లక్ష్మీ నరసింహస్వామి వారిని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నాదేండ్ల మనోహర్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

------------------------------

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం – ఇఫీ 5వ రోజుకు చేరుకుంది. ఈ రోజు కార్యక్రమాలలో భాగంగా ప్రారంభ చిత్రం "ఫియుమే ఓ మోర్టే" ప్రదర్శిస్తున్నారు. అలాగే జపనీస్ చిత్రం 'టూ స్ట్రేంజర్స్, టూ సీజన్స్' ను ప్రదర్శిస్తారు. ప్రముఖ హిందీ చలన చిత్రనిర్మాత, ఎడిటర్ రాజ్ కుమార్ హిరానీ ఎడిటింగ్ ప్రాముఖ్యతపై మాస్టర్ క్లాస్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇఫీలో మొదటిసారిగా, కృతిమ మేధ– ఏఐ హ్యాకథాన్ కూడా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వినూత్నమైన ఏఐ ఆధారంగా చిత్రనిర్మాతలు, సాంకేతిక నిపుణులు, కథకులు సినిమా సాధనాలను రూపొందించడంపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

------------------------------

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రాధ్యానత ఇవ్వాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిన్న పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ పరిష్కరించడానికే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. తక్షణ పరిష్కార మార్గం చూపగలిగే సమస్యలను అక్కడే ఉన్న అధికారుల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి తెలిపారు.

------------------------------

కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలను అనంతపురం జిల్లా కార్మిక సంఘాలు స్వాగతిస్తున్నాయి. గతంలో ఉన్న 29 చట్టాలను సవరణ చేసి నాలుగు కోడ్స్‌గా అమలు చేయడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్య, పని పరిస్థితుల కోడ్‌ల వల్ల కార్మికులకు ఎంతో ఉపయోగం ఉంటుదని అనంతపురం జిల్లా భారతీయ మజ్దూర్ సంఘ్ మాజీ కార్యదర్శి లక్ష్మయ్య తెలియజేస్తూ

వాయిస్ 35 సెకన్లు

------------------------------

అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం తెలుగుదేశం పార్టీ, అనుబంధ విభాగాల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. యువతకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని రంగనాయకుల పేట శ్రీవెంకటమ్మ పేరంటాలు ఆలయంలో కోటి 15 లక్షల రూపాయలతో మూడంతస్తుల రాజగోపురం, మహా మండపం నిర్మాణ పనులకు మంత్రి నారాయణ, నెల్లూరు లోక్ సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి నిన్న ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు, ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా గుండుగొలనులో 1880 నవంబరు 24వ తేదిన జన్మించిన ఆయన వైద్య విద్యను అభ్యసించిన అనంతరం మచిలీపట్నంలో వైద్య సేవలను చేపట్టారు. అయితే జాతిపిత మహాత్మ గాంధి పిలుపు మేరకు స్వాతంత్రోద్యమంలో పాల్గొని పలు పర్యాయాలు జైలుకు వెళ్లారు.

పార్లమెంట్ సభ్యునిగా, మధ్యప్రదేశ్ గవర్నర్‌గా సేవలందించి, తెలుగు భాషకు, తెలుగుజాతికి చిరస్మరణీయమైన సేవలందించిన పట్టాభి సీతారామయ్య 1959 డిసెంబర్ 17వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఆగ్నేయ బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న దక్షిణ అండమాన్ సముద్రంలో ఈరోజు వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైయస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..19 సెకన్లు

=====================